
సాక్షి నల్లగొండ

శుక్రవారం ၊ 29 ၊ నవంబర్ ၊ 2024



కంపెనీలో అగ్నిప్రమాదం

దండుమల్కాపురం పరిధిలోని బొర్రోళ్ల గూడెం సమీపంలో ఉన్న పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. - 8లో



నేటి నుంచి అర్వపల్లి ఉర్సు

అర్వపల్లి సమీపంలోని దర్గా ఉర్సు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. - 8లో



పవర్‌ప్లాంట్ పరిశీలన

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను టీజీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖి గురువారం పరిశీలించారు. - 10లో

న్యూస్‌రీల్

ఎల్‌సీడీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్ : జిల్లాలో డిసెంబర్ 2న నిర్వహించనున్న లెప్రసీకేస్ డిటెక్టివ్ క్యాంపు (ఎల్‌సీడీసీ)ను విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మెడికల్ ఆఫీసర్లు సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్యాధికారులు సూపర్‌వైజర్లు, సిబ్బంది సమన్వయం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్లు కళ్యాణ్ చక్రవర్తి, అరుంధతి, కేశవ, ఆర్.దుర్గయ్య, పద్మ, డెమో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం బదిలీ

- నూతన ఆర్‌ఎంగా జానిరెడ్డి



ఆర్‌ఎం జానిరెడ్డి

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్‌ఎం రాజశేఖర్ సికింద్రాబాద్‌కు బదిలీ చేస్తూ గురువారం ఆర్టీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్‌లో పనిచేస్తున్న జానిరెడ్డిని నల్లగొండ ఆర్‌ఎంగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



ఎరువులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ : ఎరువుల డీలర్లు, ఫర్టిలైజర్స్ దుకాణాదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని ఫర్టిలైజర్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. మండలంలోని ఉట్లపల్లిలో వరి నారుమడిని పరిశీలించి యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ దేవ్ సింగ్, ఏఓ సైదానాయక్, ఏఈఓ గోపి, రైతులు చందర్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను రక్షించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : సమాజ మనుగడ కోసం సహజ వనరులను రక్షించుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నల్లగొండ డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం కోసం ప్రకృతిలో మార్పులను అధ్యయనం చేయాలన్నారు. నిత్యం మన చుట్టూ జరిగే ప్రతిదీ సైన్స్‌తో ముడిపడి ఉందని పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను చైతన్యం చేయడానికి జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సైన్స్ సంబరాలు విజయవంతం కావాలన్నారు. అనంతరం జీవపరిణామం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నర్సింహ, ఎం.పాపయ్య, వున్న రవీందర్, కె.అంజిరెడ్డి, వి.చంద్రశేఖర్‌రెడ్డి, కోలా శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, విమల, గుత్తికొండ సుదర్శనరెడ్డి, కంపల్లి రాఫెల్, ఉస్మాన్ అలీ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు తొలుత సుప్రభాత సేవ చేపట్టి స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

- పూలేకు నివాళి



మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని గడియారం సెంటర్‌లో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నల్లగొండ : ఎస్‌బీఐ ఆర్‌సెటి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నిరుద్యోగులకు ఏసీ, ఫ్రిజ్ రిపేర్, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌బీఐ ఆర్‌సెటి డైరెక్టర్ ఇ.రఘుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల నిరుద్యోగ గ్రామీణ యువకులకు నెల రోజుల పాటు ఉచిత శిక్షణ, భోజన, వసతి కల్పిస్తామని తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంట పదో తరగతి ఉత్తీర్ణులైన యువకులు ఎస్‌బీఐ, ఆర్‌సెటి, రాంనగర్, నల్లగొండలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9701009265 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీకి నిరీక్షణ

- మూడు విడతల్లో రూ.1767.98 కోట్లు మాఫీ
- వివిధ కారణాలతో సుమారు 60 వేల మంది రైతులకు దక్కలే..
- ఆయా రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపిన వ్యవసాయ శాఖ
- ఐదు నెలలుగా తప్పని ఎదురుచూపులు



రుణమాఫీ అయిన వివరాలు ఇలా..

నియోజకవర్గం	రైతులు	రూ.(కోట్లలో)
నాగార్జునసాగర్	34,520	281.22
దేవరకొండ	38,110	333.08
మిర్యాలగూడ	21,976	158.01
మునుగోడు	36,713	317.69
నకిరేకల్	29,638	245.23
తుంగతుర్తి	33,766	283.51
నల్లగొండ	17,763	149.33
మొత్తం	2,12,486	1767.98

నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా అమలు చేసిన పంట రుణమాఫీ జిల్లాలో సుమారు 60 వేల మంది రైతులకు అందలేదు. మూడు విడతల్లో మొత్తం రూ.1767.98 కోట్లు మాఫీ చేయగా.. వివిధ కారణాలతో కొందరికి మాఫీ దక్కలేదు. తొలుత జూలై నెలలో రుణమాఫీ కాని రైతులందరూ దరఖాస్తులు అందజేయాలని ప్రభుత్వం సూచించడంతో వారంతా పెద్ద ఎత్తున జిల్లా, మండల వ్యవసాయాధికారి కార్యాలయాల్లో పెద్ద ఎత్తున దరఖాస్తులను అందజేశారు. వాటన్నింటిని ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపించామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కానీ ఐదు నెలలుగా ఆయా రైతులకు రుణమాఫీ అందలేదు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసిన చేసిన రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఇతర కారణాలతో ఆగిన రైతులకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

మూడు విడతల్లో మాఫీ..

ఎన్నికల హామీల్లో భాగంగా జూలై నెల నుంచి రుణమాఫీని అమలు చేసిన ప్రభుత్వం రూ.రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. జూలై 18న మొదటి విడుతలో 1,05,197 మందికి రూ.579.14 కోట్లను, జూలై 30న రెండవ విడుతలో 63,014 మందికి రూ.632.92 కోట్లు, ఆగస్టు 15న మూడవ విడుతలో 44,275 మంది రైతులకు రూ.555.92 కోట్లను కలిపి.. మొత్తం 2,12,486 మంది రైతులకు మొత్తం రూ.1767.98 కోట్లను మాఫీ చేసింది. అయితే వివిధ కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదు. కుటుంబసభ్యుల నిర్ధారణ కాలేదని, బ్యాంకు కోడ్ తప్పుందని, డాటానాట్ ఫౌండ్ అనే కారణాలతోపాటు రుణమాఫీ, ఆధార్‌కు బ్యాంకు అకౌంట్‌కు లింక్ లేదని వెబ్‌సైట్‌లో రైతు ఆధార్ నంబర్ ఎంటర్ చేస్తే చూపించింది. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మంది రైతులకు రుణమాఫీ దక్కలేదు.

44 వేల మంది కుటుంబ సభ్యుల నిర్ధారణ..

రెండు నెలల క్రితం వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాల్లోనే రైతుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసింది. అందులో రుణమాఫీ కాని కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాక రుణమాఫీ అందని వారు 44 వేల మంది ఉన్నట్లు నిర్ధారించారు. వీరితోపాటు డాటా నాట్‌ఫౌండ్, రూ.రెండు లక్షలకు పైగా రుణం ఉన్నవారు, బ్యాంకు నుంచి రైతుల వివరాలను పంపించని వారు సుమారు 16 వేలకుపైగా రైతులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలా సుమారు 60వేల మంది రైతులు రుణమాఫీ కోసం గత ఐదు నెలలుగా నిరీక్షిస్తున్నారు. అసలు రుణమాఫీ అవుతుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారు.

“ వడ్డీ కట్టినా రుణమాఫీ కాలేదు



నిడమనూరు గ్రామీణ వికాస్ బ్యాంకులో గతేడాది వానాకాలం సీజన్‌లో రూ.2 లక్షల పంటరుణం తీసుకున్నాను. రూ.2 లక్షలు ఎక్కువ ఉన్న వారు పంటరుణం వడ్డీ చెల్లిస్తే జమ చేస్తామని చెప్పడంతో వడ్డీ జమ చేశాం. అయినా ఇంత వరకు ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనే నమ్మకం కూడా పోయింది.

– వి.రిషిత, మహిళా రైతు, అన్నారం, త్రిపురారం మండలం

త్వరలో రైతులందరికీ రైతు భరోసా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : త్వరలో రైతులందరికీ రైతు భరోసా డబ్బులను వారి ఖాతాలో జమ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో రైతు సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కేసీఆర్ తెలంగాణను అప్పులపాలు చేస్తే.. వాటిని భరిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతుంటే ప్రధాని మోదీ విమర్శించడం శోచనీయమన్నారు. కేసీఆర్ ఏడు లక్షల కోట్ల అప్పు చేసి ఫామ్‌హౌస్‌లో పండుకున్నాడని విమర్శించారు. అల్లుడు హరీష్‌రావు, కొడుకు కేటీఆర్ గురుకులాల గురించి మాట్లాడితే తాను సమాధానం చెప్పనని, వాళ్లు తన స్థాయి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్ వచ్చి మాట్లాడాలన్నారు. రూ.30 వేల కోట్లతో చేపట్టబోయే రీజినల్ రింగ్ రోడ్డు శంకుస్థాపనకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి గడ్కరీని కలిసి ఆహ్వానిస్తామన్నారు. అభివృద్ధి నిధుల కోసం కేంద్ర మంత్రులను కలుస్తున్నామన్నారు.

డిసెంబర్ 7న సీఎం పర్యటన!

బ్రాహ్మణ వెల్లెంల – ఉదయ సముద్రం ప్రాజెక్టు, నల్లగొండ మెడికల్ కళాశాలకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు నిర్వహించి, ఎన్జీ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అదేరోజు నల్లగొండలో రూ.110 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తదితర పనులు, రూ.40 కోట్లతో నర్సింగ్ కళాశాలకు, పాత టౌన్ హాల్‌లో నూతన గ్రంథాలయం, రూ.100 కోట్లతో లతీఫ్‌సాబ్, బ్రహ్మంగారి గుట్టలకు ఘాట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. డిసెంబర్ 7న సీఎం వచ్చే అవకాశం ఉందని.. సీఎం పర్యటన తేదీనికి శుక్రవారం ఖరారు చేసి ప్రకటిస్తామని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌ను ఇప్పటికే నింపడంతో చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు పైకి వచ్చి సాగు పెరుగుతోందన్నారు. మూసీతో ఎక్కువ నష్టపోయేది నల్లగొండ జిల్లా ప్రజలేనని.. మూసీ ప్రక్షాళనతో ఇక్కడి ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని 20 నెలల్లోనే పూర్తి చేస్తామన్నారు. నల్లగొండ రీజనల్ రింగ్ రోడ్డుకు టెండర్లు పిలిచామని.. త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను డిసెంబర్ 5వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ : విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె భోజనశాల స్టోర్ రూం, వంట చేసే ప్రదేశాన్ని పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఇష్టంగా చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకుని వేడి ఆహారాన్ని భుజించాలన్నారు. అనంతరం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. వాడపల్లిలోని శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ జవహర్‌లాల్, డీసీఓ లక్ష్మయ్య, ఎంఈఓ బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ కవిత తదితరులు ఉన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వేములపల్లి(మాడ్గులపల్లి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాడ్గులపల్లి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలన్నారు. సన్నరకం ధాన్యాన్ని కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్ రూ.500 పొందాలన్నారు. జిల్లాలో 30,596 మంది రైతుల నుంచి రూ.1,74,125 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24,600 మంది రైతుల అకౌంట్‌లో రూ.335కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అందులో సన్నరకం ధాన్యానికి రూ.2.44కోట్లు బోనస్ రూపంలో అందించినట్లు వెల్లడించారు. ఆయన వెంట డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, ఏపీఎం చంద్రశేఖర్, వీఏఓ సోమయ్య తదితరులు ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకే జాతీయ సాధన సర్వే

నల్లగొండ : జాతీయ సాధన సర్వే పరీక్షతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని డీఈఓ భిక్షపతి అన్నారు. గురువారం నల్లగొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల, బీఈడీ కాలేజీ, డీపీఎం ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల నుంచి ఎంపిక చేసిన సర్వే నిర్వహణ విధానంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎన్ఏఎస్ (జాతీయ సాధన సర్వే) చక్కని వేదిక అన్నారు. విద్యార్థులంతా వచ్చే నెల 4న నిర్వహించనున్న జాతీయ సాధన సర్వేకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ జిల్లా స్థాయి కోఆర్డినేటర్ పార్థసారథి, ఆర్.రామచంద్రయ్య, డైట్ ప్రిన్సిపాల్ నర్సింహ, కొమ్ము శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణ వాయిదా

మిర్యాలగూడ : పెన్నా సిమెంట్ కర్మాగారం మైనింగ్ విస్తీర్ణం, ఉత్పత్తి సామర్థ్యం పెంపుదల కోసం ఈనెల 29న నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రెండవసారి వాయిదాపడింది. 2002లో పెన్నా సిమెంట్స్‌ను నెలకొల్పగా రెండు నెలల క్రితం ఈ ప్లాంట్‌ను అదాని గ్రూప్ కొనుగోలు చేసింది. అనధికారికంగా గనుల విస్తరణ జరిగినప్పటికీ వివిధ కారణాల వల్ల పీసీబీ ప్రజాభిప్రాయం సేకరించలేదు. దామరచర్ల మండలంలో గణేష్‌పాడు పరిధిలో 304 హెక్టార్లు, సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్లలో మైనింగ్ లీజు ఉంది. 354 హెక్టార్లు సున్నపురాయి గనులను విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచేందుకు అనుమతి కోసం పరిశ్రమ యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. అయితే ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మాసిటీకీ వ్యతిరేకంగా ఆందోళనతోపాటు నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీని ఆపివేయాలని ప్రజలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఇక్కడ కూడా ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. 29న నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షాదివస్‌కు పోలీసు బందోబస్తు అవసరం ఉన్నందున ఇక్కడ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేసినట్లు తెలిసింది.

దీక్షా దివస్ ఏర్పాట్ల పరిశీలన



నల్లగొండలోని క్లాక్ టవర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని గడియారం సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్ స్థలాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, జమాల్‌ఖాద్రి, మెరుగు గోపి, బోనగిరి దేవేందర్ తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులందరికీ రగ్గులు అందిస్తాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్
- జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టళ్ల తనిఖీ
- జిల్లాలో 200 మందికి రగ్గులు అందజేత

సాక్షి ఎఫెక్ట్..

సూర్యాపేట టౌన్: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు చలికి ఇబ్బంది పడకుండా అందరికీ రగ్గులు అందజేస్తామని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. చలికి హాస్టళ్లలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై సాక్షి విజిట్ నిర్వహించి 'సంక్షేమంలో వణుకు' శీర్షికన కథనాన్ని గురువారం ప్రచురించింది. దీనికి కలెక్టర్ స్పందించారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కస్తూరి బజార్‌లో గల ఎస్సీ బి బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలలో సిద్ధంగా ఉన్న వంటలు, స్టాక్ రిజిస్టర్ ప్రకారం స్టోర్‌లో ఉన్న వస్తువులను పరిశీలించారు. విద్యార్థులకు రగ్గులు అందజేశారు. అలాగే ఎస్సీ బాలుర ఏ2, ఎస్సీ బాలుర బి2 హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు రగ్గులు అందించారు. ఈమూడు హాస్టళ్లలో 90మంది విద్యార్థులకు రగ్గులు అందజేశారు. జిల్లాలోని మరికొన్ని హాస్టళ్లలో 110 రగ్గులను విద్యార్థులకు అధికారులు అందజేశారు. జిల్లావ్యాప్తంగా 23 మండలాల్లో 500 పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటిలో గురువారం 200 పంపిణీ చేశారు. మిగితావి రెండు రోజుల్లో అందజేయనున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వండిన ఆహారాన్ని మెస్ కమిటీ తిన్న తర్వాతే విద్యార్థులకు పెట్టాలన్నారు. మిగతా వసతి గృహాల్లోని విద్యార్థులకు కూడా రగ్గులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, డీఎస్సీడీఓ లత, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్ సాయి గౌడ్, తహసీల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి, హరిచంద్ర ప్రసాద్, వార్డెన్ ఉప్పలయ్య పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర బి హాస్టల్‌లో విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో ఆర్డీఓ వేణుమాధవరావు

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రీ, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాల సంక్షేమ అధికారులు స్థానికంగా ఉంటూ రోజూ హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన చందుపట్ల వార్డెన్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో మైనర్ రిపేర్ల నిమిత్తం రూ.లక్ష నిధులు కేటాయిస్తున్నట్టు, వెంటనే రిపేర్లు చేయించుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులు లత, శంకర్, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్‌లోని గడ్డి దగ్ధం

చిలుకూరు: విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి కాలిపోయింది. ఈ ఘటన గురువారం చిలుకూరు మండలం బేతవోలు రోడ్డులో సుబ్బోరిగూడెం సమీపంలో జరిగింది. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన పొదిలి సైదులుకు చిలుకూరు మండలం బేతవోలు గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. సైదులు గురువారం తన పొలం నుంచి గడ్డిని ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో సుబ్బోరిగూడెం వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లు గడ్డికి తగలడంతో మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన సైదులు ట్రాక్టర్ హైడ్రాలిక్ లేపి గడ్డిని కిందకు పడేశాడు. దీంతో గడ్డి పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే గడ్డి దగ్ధమైందని, ప్రభుత్వం తనకు నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

విద్యుత్ మోటార్లు చోరీ

నడిగూడెం: మండల పరిధిలోని చాకిరాల, సిరిపురం గ్రామాల సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై పలువురు రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఒక్కో మోటారు విలువ దాదాపు రూ.30 వేలకు పైగా ఉంటుందని బాధిత రైతులు కె. శ్రీను, జి. నర్సయ్య, శేషగిరిరావు, బి. వెంకన్న, శ్రీనివాసరెడ్డి, బి. నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

కోదాడ: మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి కోదాడ పట్టణంలోని గాంధీ సమభావన సంఘం సభ్యుల పేరిట తీసుకున్న రూ.10లక్షలు రుణం తీసుకుని వారికి రూ.3లక్షలు మాత్రమే ఇచ్చారనే విషయంలో తనకెలాంటి సంబంధం లేదని, వారు రుణం తీసుకున్న సమయంలో తాను రీసోర్స్‌పర్సన్‌ను కాదని కేవలం అంబేద్కర్ కాలనీ ఎస్ఎల్ఎఫ్‌గా మాత్రమే పనిచేశానని చింతా కెజ్జమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన కుమారుడు ప్రమాదంలో మృతిచెందడంతో తాను ఎస్ఎల్ఎఫ్‌గా కూడా రాజీనామా చేశానన్నారు. కొందరు కావాలని తనపై ఆరోపణలు చేస్తున్నారని, అవి అవాస్తవమని అన్నారు. మున్సిపాలిటీలోని సీఈఓ, సీఎల్ఆర్‌పీ, కంప్యూటర్ ఆపరేటర్లకు తెలియకుండా ఏమీ జరగదని వారిని విచారిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆమె పేర్కొన్నారు.

తప్పుడు కేసు పెట్టిన వ్యక్తికి జరిమానా

సూర్యాపేటటౌన్: ఉద్యోగం రెగ్యులరైజ్ చేయించుకోవాలనే ఉద్దేశంతో పోలీసు శాఖపై హైకోర్టులో తప్పుడు కేసు వేసిన చిలుకూరు మండలానికి చెందిన షేక్ జానిమియాకి న్యాయస్థానం రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో 1991 నుంచి స్వీపర్‌గా చేస్తున్నానని, తనను రెగ్యులరైజ్ చేయాలని జానిమియా తప్పుడు పత్రాలు సృష్టించి 2018లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌కుమార్ గురువారం కేసును కొట్టివేశారు. కోర్టు, ఉద్యోగుల సమయాన్ని వృథా చేసినందుకు రూ.5000 జరిమానా విధించి, ఆ నగదును ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేస్తూ తీర్పు వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మర్రిగూడ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సరంపేట, రాంరెడ్డిపల్లి గ్రామాల మధ్య గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన పల్లపు భరత్ మర్రిగూడ నుంచి శివన్నగూడకు వస్తుండగా మార్గమధ్యలో తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో అతడు రోడ్డు పక్కన నిలబడి ఉండగా అదే సమయంలో మర్రిగూడ నుంచి అంతంపేటకు వెళ్తున్న మరో ద్విచక్రవాహనదారుడు రోడ్డు పక్కన ఉన్న భరత్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భరత్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నేటి నుంచి అర్వపల్లి దర్గా ఉర్సు

- సాయంత్రం 4 గంటలకు అర్వపల్లి పోలీస్ స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు
- శనివారం దీపారాధన
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు


లైట్ల వెలుగుల్లో దర్గా


ఏర్పాట్లను పరిశీలిస్తున్న వక్ఫ్ బోర్డు ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ మహమూద్, ఎస్ఐ బాలకృష్ణ

అర్వపల్లి: అర్వపల్లి సమీపంలోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. శుక్రవారం సాయంత్రం 4గంటలకు అర్వపల్లి పోలీస్ స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు మొదలై రాత్రి 9గంటల వరకు దర్గాకు చేరుకుంటుంది. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. రాత్రి ఖవ్వాలీ కార్యక్రమం ఉంటుందని, శనివారం సాయంత్రం దీపారాధన (చిరాగ్) కార్యక్రమం జరుగుతుందని వక్ఫ్‌బోర్డు సూర్యాపేట జిల్లా ఇన్‌స్పెక్టర్ మహమూద్, దర్గా ముజావర్ సయ్యద్ అలీ తెలిపారు.

పూర్తయిన ఏర్పాట్లు..

ఏడాదికోసారి జరిగే ఈ ఉర్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లింలు తరలిరానున్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. రంగురంగుల లైట్లతో దర్గాతో పాటు దర్గా పరిసరాలను అలంకరించారు. దర్గా ఎదుట భక్తులు క్యూలైన్‌లో వచ్చేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. నీటి వసతి కల్పించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఫార్మేషన్ రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలివచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. గంధం ఊరేగింపు సందర్భంగా గంధం పాత్రలను ప్రజాప్రతినిధులు, పోలీసులు, వక్ఫ్‌బోర్డుతో పాటు వివిధ శాఖల అధికారులు ఎత్తుకొని గ్రామ శివారు వరకు ఊరేగింపులో పాల్గొంటారు. దర్గా వద్ద మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఉర్సు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సూర్యాపేట డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపారు. ఉర్సు ప్రశాంతంగా జరగడానికి భక్తులు, నిర్వాహకులు సహకరించాలని కోరారు.

ఏర్పాట్ల పరిశీలన..

దర్గా వద్ద ఏర్పాట్లను గురువారం వక్ఫ్ బోర్డు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మహమూద్, స్థానిక ఎస్ఐ బాలకృష్ణ పరిశీలించారు. శుక్రవారం గంధం ఊరేగింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారి వెంట దర్గా ముజావర్ సయ్యద్ అలీ, హబీబ్, గులాం షఫీ ఉన్నారు.

బారికేడ్లు ఏర్పాటు చేశాం



ఉర్సుకు భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. భక్తుల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశాం. క్యూలైన్‌లో వచ్చి బాబాను దర్శించుకోవాలి. పవిత్రంగా భావించే గంధాన్ని భక్తులందరికీ పంపిణీ చేస్తాం.

– సయ్యద్ అలీ, దర్గా ముజావర్

అన్ని సౌకర్యాలు కల్పించాం



ఉర్సు ఉత్సవాల సందర్భంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో దర్గా వద్ద అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాం. లైటింగ్, నీటి వసతి, రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం.

– మహమూద్, వక్ఫ్‌బోర్డు ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

మోతె: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోతె మండలం నామవరం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నామవరం గ్రామానికి చెందిన ఎస్‌కే మల్సూర్ పెద్ద అల్లుడు ఎండీ నాగుల్‌మీరా(32) పెళ్లి అయినప్పటి నుంచి నామవరం గ్రామంలో అత్తమామల వద్దే ఉంటూ.. గత ఐదేళ్లుగా సూర్యాపేట మండలం రాయినిగూడెం పరిధిలోని మహేంద్ర షోరూంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన ఖమ్మంలో తన బంధువుల పెళ్లికి హాజరైన నాగుల్‌మీరా మరుసటిరోజు రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో బంధువులు ఇచ్చిన విందులో గొడవ చేశాడు. గురువారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి రాఘవాపురం ఎక్స్ రోడ్డు దగ్గరలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ వెనుక పానుగోటి అప్పారావు పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కౌలు చేస్తున్న రైతు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి అన్న లాల మహమ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

సూట్‌కేసుల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం


మంటలు చెలరేగడంతో కంపెనీలో నుంచి వస్తున్న దట్టమైన పొగ


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

- మూడు ఫైరింజన్లతో మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది
- భారీగా ఆస్తి నష్టం
- షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని బొర్రోళ్లగూడెం సమీపంలో సూట్‌కేసులు, బ్యాగులు తయారుచేసే పరిశ్రమలో గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడ గతంలో డాంబర్ తయారుచేసే పరిశ్రమ ఉండగా.. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు దానిని కొనుగోలు చేసి వాంటో సూట్‌కేసుల తయారీ కంపెనీ ప్రారంభించారు. గురువారం సాయంత్రం కార్మికులు సూట్‌కేసులు తయారుచేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు గమనించిన కార్మికులు బయటకు పరుగు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు.

మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది..

మంటలు సూట్‌కేసులు తయారుచేసే షెడ్డులోకి వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. దీంతో ఫైర్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో చౌటుప్పల్, హయత్‌నగర్, భువనగిరిల నుంచి మూడు ఫైరింజన్లతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని యాదాద్రి భువనగిరి జిల్లా ఫైర్ ఆఫీసర్ మధుసూదన్‌రావు పర్యవేక్షణలో మంటలను అదుపులోకి తెచ్చారు.

మిషన్లు దగ్ధం..

మంటలు భారీగా ఎగిసిపడడంతో పరిశ్రమలోని ముడిసరుకుతో పాటు తయారుచేసిన సూట్‌కేసులు, బ్యాగులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సూట్‌కేసులు తయారుచేసే యంత్రాలు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత కల్యాణతంతు పూర్తిచేసి నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


ఎగ్జామ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. నల్లగొండలోని పరీక్ష కేంద్రాలను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు.

కల్యాణలక్ష్మి నిధులు స్వాహా చేసిన వ్యక్తుల అరెస్ట్

నూతనకల్: తప్పుడు పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి నిధులు స్వాహా చేసిన పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపారు. నూతనకల్ మండల పరిధిలోని మాచనపల్లి, మిర్యాల గ్రామాల్లో అర్హులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించకుండా తప్పుడు పత్రాలు సృష్టించి 10 మంది అనర్హులకు ఇచ్చినట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి పంచాయతీ కార్యదర్శులు వెన్న వెంకట్‌రెడ్డి, దేశమల్ల అనిల్‌తో పాటు మట్టిపల్లి సందీప్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ

గుండాల: గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావుల వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరు చోరీ చేశారు. ఈ ఘటన గుండాల మండలం బూర్జుబావి గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. రైతులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలంలోని బూర్జుబావి, జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం జీడికల్ గ్రామాల మధ్యన గల రైతుల వ్యవసాయ బావుల వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి పగులగొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లగా.. ట్రాన్స్‌ఫార్మర్లు పగిలి ఉండటం గమనించి లింగాల ఘణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శానిటైజర్ తాగి నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం


సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

కోదాడ: అస్సాం రాష్ట్రం నుంచి వచ్చి కోదాడలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సు చదువుతున్న విద్యార్థిని.. హాజరు శాతం తక్కువగా ఉన్నందుకు అధిక ఫీజు చెల్లించాలని కాలేజీ నిర్వాహకులు వేధిస్తున్నారని బుధవారం రాత్రి శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. కోదాడ పట్టణంలోని భవానీనగర్‌లో గల స్నేహ నర్సింగ్ కళాశాలలో అస్సాం రాష్ట్రానికి చెందిన నర్గిస్ పర్వీన్ నర్సింగ్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాలలకు సక్రమంగా హాజరు కానందున ఫీజు అదనంగా చెల్లించాలని కళాశాల నిర్వాహకులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం కళాశాల హాస్టల్‌లో ఆమె శానిటైజర్ తాగింది. ఇది గమనించిన హాస్టల్ వార్డెన్ సదరు విద్యార్థినిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. గురువారం ఆమె బంధువులు వచ్చి స్నేహ నర్సింగ్ కళాశాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోదాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి: స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన కేదరి వంశీ(21), గోపగోని రాములు గురువారం నకిరేకల్ నుంచి చిట్యాల వైపు స్కూటీపై వస్తుండగా.. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ సమీపంలోని ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కేదరి వంశీ అక్కడికక్కడే మృతిచెందగా.. రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన రాములును నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. వంశీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

బైక్ పైనుంచి కిందపడి..

మిర్యాలగూడ టౌన్: బైక్ పైనుంచి కిందపడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ మండలంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన నెక్కండి రమేష్, అతడి భార్య దివ్య(28) బైక్‌పై మిర్యాలగూడకు వస్తున్నారు. మార్గమధ్యలో వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో రైల్వే బ్రిడ్జి సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పడంతో దివ్య బైక్ పైనుంచి కిందపడింది. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పండ్ల వ్యాపారులు వెంటనే ఆమెను 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి భర్త రమేష్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి మేనమామ అటూరు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

సీసీఎస్ పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నేత

- సైబర్ నేరం కేసులో అరెస్టు చేసినట్లు సమాచారం

మిర్యాలగూడ అర్బన్: సైబర్ నేరం కేసులో మిర్యాలగూడ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారితో పాటు మరో వ్యక్తిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం నాగార్జునచారి నివాసానికి వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముంబై కేంద్రంగా జరిగిన సైబర్ నేరాలకు సంబంధించి మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కొందరు వ్యక్తుల బ్యాంక్ అకౌంట్ల నుంచి లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు బ్యాంకు ఖాతాలు గల వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా.. వారు ఇచ్చిన సమాచారం మేరకు నాగార్జునచారితో పాటు అదే కాలనీకి చెందిన నాగేంద్రచారిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం ఈ విషయమై టూటౌన్ సీఐ నాగార్జునను సంప్రదించగా సీసీఎస్ పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ధ్రువీకరించారు. కేసు వివరాలు తమకు తెలియదని సీఐ పేర్కొన్నారు.

పద్మశాలీల అభ్యున్నతికి పాటుపడాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

సూర్యాపేట టౌన్: పద్మశాలీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సూర్యాపేట పట్టణ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. చేనేత వృత్తిని అభివృద్ధి పథంలో నడిపే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన మిట్ట కోల సతీష్ కుమార్‌తోపాటు కమిటీ ఉపాధ్యక్షులు కోట వీరయ్య, గంజి శ్రీనివాస్, తలిశెట్టి శ్రీనివాస్, తలిశెట్టి మారుతి, ప్రధాన కార్యదర్శిగా ఏలె ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా పరకాల శ్రీనివాస్, కేతం వెంకన్న, పరకాల ప్రవీణ్, రెబ్బ శ్రీనివాస్, కోశాధికారిగా మిట్టగోల మధుబాబులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, జిల్లా అధ్యక్షురాలు నక్క రమాదేవి, నాగుల వాసు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు

- ప్రభుత విప్ బీర్ల ఐలయ్య
- ఆలేరులోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్ : పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను గురువారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారుచేసిన వంటలను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, రోజూ ఎంతమందికి భోజనం చేస్తున్నారని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందంటూ ఆరా తీశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై తెలుసుకున్నారు. అలాగే వంట గదులను పరిశీలించారు. హాస్టల్‌లో సౌకర్యాలు కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని వార్డెన్‌కు సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వంట గది, హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని, లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నీలం పద్మ, తుంగ కుమార్, వెంకటస్వామి, బుగ్గ నవీన్, ఎజాజ్, శ్రీకాంత్, లోకేష్, లక్ష్మణ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబించేలా..

నేడు బీఆర్ఎస్ దీక్షా దివస్

- భువనగిరిలో సభ
- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు


దీక్షా దివస్ సభా స్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : స్వరాష్ట్ర సాధనకోసం నినదించిన పోరుగడ్డ భువనగిరి.. దీక్షా దివస్‌కు సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2009 డిసెంబర్ 9వ తేదీన చేపట్టిన ఆమరణ దీక్షను మరోసారి గుర్తు చేసుకుంటూ దీక్షా దివస్ భారీ ఎత్తున నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భువనగిరిలోని జగ్జీవన్‌రాం చౌరస్తాలో నిర్వహించే సభకు జిల్లా నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులను తరలించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ కొలుపుల అమరేందర్, మరికొందరు నాయకులు గురువారం దీక్షా దివస్ వేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. దీక్ష దివస్ విజయవంతం చేసేందుకు మూడ్రోజుల క్రితం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, దీక్షా దివస్ ఇంచార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

పార్టీలకు అతీతంగా పోరుబాట

తెలంగాణ మలిదశ ఉద్యమంలో భువనగిరి ముందుంది. ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గా పార్టీలకు అతీతంగా ప్రజలు పోరుబాటలో కదిలారు. కేసీఆర్ నాయకత్వంలో సాగిన తెలంగాణ సాధన ఉద్యమానికి మద్దతుగా ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఘన విజయం కట్టబెట్టారు.